

పాశవికమ్మగు చర్యల
దేశజులు సహించ రనుచు ధీమతి మోడీ
రాశీకృత భారతమై
నాశకులకు తెలియజెప్పె నయ్యాయికుడై !!

(ఎర్రకోట వేదికగా భారత దేశం అదరదు బెదరదు అని ప్రధాని మోడీ కరాఖండిగా చెప్పారు)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


చురక

అభివృద్ధిని తినేస్తుంది
అడుగడుగున అవినీతి
అధికారం కనేస్తుంది
అంతా స్వార్థ రాజనీతి.
స్వాతంత్ర్యం ఇన్నేళ్లుగా
సాధించిన మన ప్రగతి
ఎందుకిట్ల ప్రజాస్వామ్య
ఏలుబడిలో అదోఃగతి.



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శనివారం 16-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:12 పేజీలు:6 వెల: రూ.1/-


# సామాజికంగా, ఆర్థికంగా తెలంగాణ బలపడాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగష్టు 15:అహింసా పద్ధతిలో మహాసంగ్రామం గెలిచామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంతో ప్రపంచానికి సరికొత్త మార్గం చూపించామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో జరిగిన 79వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంతో ప్రపంచానికి సరికొత్త మార్గం చూపించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అహింసా పద్ధతిలో మహాసంగ్రామం గెలిచామని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'పటిష్ట భారత్ కోసం నెహ్రూ ఎన్నో చర్యలు చేపట్టారు. నెహ్రూ హయాంలోనే దేశ ప్రగతికి బలమైన పునాదులు పడ్డాయి. పంచవర్ష ప్రణాళికతో దేశాన్ని తిరుగులేని శక్తిగా మార్చారు.

తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాము. కులగణనతో వందేళ్ల కల నెరవేర్చాం. పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నాం. సామాజికంగా, ఆర్థికంగా తెలంగాణ బలపడాలి. సన్నబియ్యం పంపిణీతో పేదల కళ్లలో ఆనందం చూశాం. వరంగల్‌లో ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ నెరవేర్చాం. 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశాం. రైతులకు క్వింటాల్‌పై 500 రూపాయలు బోనస్ ఇస్తున్నాం. ఏటా ఉచిత విద్యుత్ కోసం 16 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం' అని అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం

సీఎం రేవంత్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించాం. గ్రూప్–1 లో 15, గ్రూప్ –2 లో 18, గ్రూప్ –3 లో 26 కులాలను చేర్చాం. ప్రతి ఏటా ఫిబ్రవరి 4ను 'తెలంగాణ సోషల్ జస్టిస్ డే' గా జరుపుకోవాలని నిర్ణయించాం. మసకబారిన ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వవైభవం తెచ్చాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 నుండి 10 లక్షలకు పెంచాం.

27 ఎకరాల విస్తీర్ణంలో 2,700 కోట్ల రూపాయల వ్యయంతో నయా ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో అనేక చోట్ల వైద్య విద్యా కళాశాలలు నిర్మిస్తున్నాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్యారోగ్య రంగంపై 16 వేల 521 కోట్ల రూపాయలు వ్యయం చేశాం. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి అనే నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం పని చేస్తున్నాం. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాం.

ఈ పథకం కింద ఆడబిడ్డలకు రూ.6790 కోట్లు ఆదా అయ్యింది. ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటడం మా విజయాలలో మరో మైలురాయి. రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమం, అభివృద్ధి కోసం మా ప్రభుత్వం మొత్తంగా 46,689 కోట్లు సమకూర్చింది. యువత తెలంగాణ శక్తికి ప్రతీక. గడచిన పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగింది. ఆ కుట్రను మేం ఛేదించాం. ఇవ్వాళ తెలంగాణలో డ్రగ్స్ అనే మాట వినబడటానికి వీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఈగల్ పేరుతో ఏర్పాటైన వ్యవస్థ రాష్ట్రం మూల మూలలా నిశితంగా నిఘా పెట్టింది. డ్రగ్స్ మాయగాళ్ల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. 20 నెలల కాలంలో దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం' అని అన్నారు.

# 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం కోసం కేంద్రం దృష్టి: ప్రధాని



న్యూఢిల్లీ, ఆగష్టు 15:79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, 2017లో అమలులోకి వచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) దేశానికి లాభాన్ని చేకూర్చిన ఒక ముఖ్యమైన సంస్కరణగా అభివర్ణించారు.

సామాన్య ప్రజలకు, రైతులకు, మధ్యతరగతికి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు ఉపశమనం కలిగించే విధంగా జీఎస్టీలో తదుపరి తరం సంస్కరణల అవసరాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు.

'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం కోసం, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ లో గణనీయమైన సంస్కరణలను ప్రతిపాదిస్తోంది. ఇవి మూడు స్తంభాలపై దృష్టి సారిస్తాయి. అవి:

నిర్మాణాత్మక సంస్కరణలు.
పన్నుల హేతుబద్ధీకరణ.
జీవన సౌలభ్యం.

జీఎస్టీ పన్నుల్లో హేతుబద్ధీకరణ, సంస్కరణలపై కేంద్ర ప్రభుత్వం తన ప్రతిపాదనను జీఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జివోఎం) పరిశీలనకు పంపింది.

పన్ను విధింపులో హేతుబద్ధీకరణతో సహా తదుపరి తరం సంస్కరణల కోసం గుర్తించిన ప్రధాన అంశాలు సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా సామాన్య ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు, మధ్యతరగతికి, రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంటాయి.

వర్గీకరణకు సంబంధించిన వివాదాలను తగ్గించడానికి కొన్ని రంగాల్లో అస్తవ్యస్తంగా ఉన్న సుంకాలను సరి చేయడానికి, రేట్లలో మరింత స్థిరత్వానికి, అలాగే వ్యాపార నిర్వహణలో సౌలభ్యాన్ని మరింత పెంచడానికి కూడా సంస్కరణలు దోహదపడతాయి. ఈ చర్యలు ప్రధాన ఆర్థిక రంగాలను బలపరచి, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించి, రంగాల విస్తరణకు వీలు కల్పిస్తాయి.

## కేంద్రం ప్రతిపాదించిన సంస్కరణల కీలక స్తంభాలు

1. నిర్మాణాత్మక సంస్కరణలు

1. సుంకాల లోటుపాట్ల సవరణ: ఇన్‌పుట్, అవుట్‌పుట్ పన్ను రేట్లను సరిచేసి, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ అధికంగా పేరుకుపోవడాన్ని తగ్గించడం. ఇది దేశీయ విలువ జోడింపు (డొమెస్టిక్ వాల్యూ ఆడిషన్) ను ప్రోత్సహిస్తుంది.

2. వర్గీకరణ సమస్యల పరిష్కారం: రేట్ల విధానాన్ని సులభతరం చేయడం, వివాదాలను తగ్గించడం, షరతుల కట్టుబాటు ప్రక్రియలను సరళీకృతం చేయడం, అన్ని రంగాల్లో సమానత్వం, స్థిరత్వం కోసం వర్గీకరణ సమస్యల పరిష్కారం.

3. స్థిరత్వం, అంచనా: పరిశ్రమ విశ్వాసాన్ని పెంపొందించడానికి, మెరుగైన వ్యాపార ప్రణాళికకు మద్దతు ఇవ్వడానికి రేట్లు, విధాన దిశపై దీర్ఘకాలిక స్పష్టతను అందించడం.

2: రేట్ల హేతుబద్ధీకరణ

1. సామాన్య ప్రజలు వాడే వస్తువులు, వారు ఆశించే వస్తువులపై పన్నుల తగ్గింపు: ఇది వాటి లభ్యతను, వినియోగాన్ని పెంచుతుంది. అవసరమైన వస్తువులను, ఆశించదగిన వస్తువులను మరింత ఎక్కువ మంది ప్రజలకు చేరువ చేస్తుంది.

2. స్లాబ్ ల తగ్గింపు: ప్రామాణికం, మెరిట్ అనే రెండు స్లాబ్‌లతో సరళమైన పన్ను విధానం. ఎంపిక చేసిన కొన్ని వస్తువులకు మాత్రమే ప్రత్యేక రేట్లు.

3. పరిహార సెస్: పరిహార (కాంపెన్సేషన్) సెస్ ముగియడం వల్ల ఆర్థిక వెసులుబాటు లభించింది. ఇది జీఎస్టీ వ్యవస్థలో పన్ను రేట్లను హేతుబద్ధీకరించడానికి, దీర్ఘకాలిక స్థిరత్వం కోసం వాటిని సర్దుబాటు చేయడానికి ఎక్కువ సౌలభ్యాన్ని అందిస్తుంది.

3: జీవన సౌలభ్యం

1. రిజిస్ట్రేషన్: ముఖ్యంగా చిన్న వ్యాపారాలు, స్టార్టప్ లకు అంతరాయం లేని, సమయ పరిమిత నమోదు ప్రక్రియ.

2. రిటర్న్: పన్ను రిటర్నులను ముందుగానే నింపి ఉంచడం ద్వారా, మాన్యువల్ గా చేసే పనిని తగ్గించి, తప్పులను నివారించడం.

3. రిఫండ్: ఎగుమతిదారులకు, సుంకాల తీరు సరిగా (విలోమ పన్ను విధానం) లేనివారికి వాపసు (రిఫండ్) ప్రక్రియను వేగంగా, స్వయంచాలన విధానంలో చేయడం.

పై మూడు మూలస్తంభాలపై ఆధారపడిన కేంద్ర ప్రతిపాదనను తదుపరి చర్చల కోసం జీఓఎంకు అందచేశారు. భాగస్వాములందరి మధ్య నిర్మాణాత్మక, సమగ్ర, ఏకాభిప్రాయ ఆధారిత చర్చ కోసం కేంద్రం ఈ చొరవ తీసుకుంది.

సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు కేంద్రం కట్టుబడి ఉంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశిస్తున్న తదుపరి తరం సంస్కరణలను అమలు చేయడానికి రాబోయే వారాల్లో రాష్ట్రాలతో విస్తృత స్థాయి ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కేంద్రం పనిచేస్తుంది.

జీఎస్టీ కౌన్సిల్ తన తదుపరి సమావేశంలో జీఓఎం సిఫార్సులపై చర్చిస్తుంది. లక్ష్యంగా నిర్దేశించిన ప్రయోజనాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే గణనీయంగా సాధించడానికి వాటిని త్వరితగతిన అమలు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తుంది. సరళమైన, స్థిరమైన, పారదర్శక పన్ను వ్యవస్థగా జీఎస్టీని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఇది సమ్మిళిత వృద్ధికి మద్దతు ఇస్తుంది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. దేశవ్యాప్తంగా వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని (ఈఓడీబీ) పెంచడం లక్ష్యంగా కలిగి ఉంటుంది.

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'



హైదరాబాద్, ఆగష్టు 15:హైదరాబాద్ రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఎట్ హోం' కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆహ్వానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.

ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ రాజ్‌భవన్‌లో రాష్ట్ర ప్రముఖులను ఆహ్వానించి తేనీటి విందు ఇవ్వడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాదికీ ప్రత్యేక ఏర్పాట్లతో అతిథులను ఆహ్వానించారు. రాజకీయ నేతల రాకతో రాజ్‌భవన్ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉదయం నుంచే వైభవంగా జరిగాయి. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గోల్కొండ కోటలో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణలో అమలు అవుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు.

# రవాణా శాఖ ఉత్తమ అధికారిగా సంగం వెంకట పుల్లయ్య

ఖమ్మం, ఆగష్టు 15: భద్రాచలం రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్, అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీజీవోస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సంగం వెంకట పుల్లయ్య రవాణా శాఖ ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు.

ఈ మేరకు శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ కోసం వినూత్న పద్ధతుల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తూ, ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం కల్పించడంలో హెల్మెట్ల పంపిణీ, రక్తదానంపై అవగాహన, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం వంటి సేవలకుగాను ఆయనను ఈ పురస్కారం వరించింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్, ఎస్పీ బి. రోహిత్ రాజు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# నాగాలాండ్ గవర్నర్ కన్నుమూత.. చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచారు..!



న్యూఢిల్లీ, ఆగష్టు 15: నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచారు. చెన్నైలోని ఆస్పత్రిలో ట్రీట్మెంట్ తీసుకుంటున్న గణేశన్ శుక్రవారం తనువు చాలించారని రాజ్‌భవన్ అధికారి తెలిపారు. ఆయన మరణ వార్త తమను ఎంతో విషాదంలోకి నెట్టిందని ఉపముఖ్యమంత్రి యన్‌తుంగో పట్టొన్ అన్నారు. పలువురు రాజకీయ ప్రముకులు గవర్నర్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు.

# ప్రత్యేక సాగుకు అరుదైన గౌరవం

మునుగోడు, ఆగస్టు 15 : మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన జాజుల బుచ్చిరాములు, ఆయన భార్య సైదమ్మ శుక్రవారం ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ దంపతులు కోతులారం గ్రామంలో వినూత్నంగా 7 ఎకరాల్లో కలబంద సాగు చేస్తున్నారు. వీరి కృషికి గుర్తింపుగా ఆర్ సి ఎఫ్ సి సిఫార్సుతో కేంద్ర ఆయుష్ విభాగం ప్రత్యేక ఆహ్వానం మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు.

# చిక్కడపల్లిలో భారీ దొంగతనం.. 36 తులాల బంగారు ఆభరణాలు చోరీ

హైదరాబాద్, ఆగష్టు 15:రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో దోపిడీ దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ నగర ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. మొన్న చందానగర్ ఖజానా జ్యువెలరీ దుకాణం, కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్‌లో ఎంఐజీ 14లో నివాసముంటున్న రిటైర్డ్ తహసీల్దార్ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి భారీగా బంగారు ఆభరణాలను అపహరించుకు పోయిన సంగతి తెలిసిందే.

తాజాగా నగరం నడిబొడ్డున ఉన్న చిక్కడపల్లిలో భారీ చోరీ జరిగింది. చిక్కడపల్లిలో నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంట్లోకి శుక్రవారం తెల్లవారుజామున దొంగలు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 36 తులాల బంగారు ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ చోరీపై నారాయణ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# హైదరాబాద్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 15:CREDAI నిర్వహిస్తోన్న హైదరాబాద్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. అపోహలు, అనుమానాలను దాటుకుని రాష్ట్ర అభివృద్ధిలో ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని సీఎం చెప్పారు. అపోహలు సృష్టించడం ద్వారా అభివృద్ధిని అడ్డుకోవాలనుకునేవారికి కనువిప్పు కలిగించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నానని సీఎం తెలిపారు. ప్రభుత్వం పాలసీ, కన్‌స్ట్రక్షన్ రెండూ.. రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్ లాంటివి అని సీఎం అన్నారు.

పాలకులు మారినా పాలసీ పెరాలసిస్ లేకుండా చూడటం వల్లే మనం ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'నాయకుల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు కొంతకాలం అనుమానాలు, అపోహలకు తావిస్తుంది. పారదర్శక పాలసీలతో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. పెట్టుబడులకు రక్షణ కల్పించడమేకాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత మా ప్రభుత్వానిది.. మాది. రాజకీయ నాయకులు సృష్టించే అపోహలకు మీరు ఊతం ఇస్తే నష్టపోయేది మీరే. అలాంటి అపోహలను తొలగించడానికే ఇక్కడికి వచ్చా. ఇతర దేశాల ప్రతినిధులను ఇక్కడ పెట్టుబడులకు ఆహ్వానించే మేము? ఇక్కడే ఉన్న మిమ్మల్ని ఎందుకు వదులుకుంటాం?' అని సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ రంగ ప్రముఖుల్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

పెట్టుబడుల విషయంలో మీకే మా మొదటి ప్రాధాన్యత అని క్రెడయ్ నిర్వాహకుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి.. 'నేను సగటు మధ్యతరగతి ఆలోచనలు ఉన్న ముఖ్యమంత్రిని. కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న విశాల దృక్పథం ఉన్న వాడిని కాదు. సమాజ శ్రేయస్సు కోసమే నేను ఆలోచిస్తా..అందుకే మీరు అడిగిన కొన్నింటికి నేను అంగీకరించకపోవచ్చు.. నేను ఎప్పటికీ మీకు ఆ రకంగా సహకరించను.. పారదర్శక విధానంలో ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధికి సహకరించేందుకు నాకు అభ్యంతరం లేదు.' సీఎం క్లారిటీ ఇచ్చారు.

# అక్రమ సరోగసీ, ఎగ్ డొనేట్ చేస్తున్న వారిని అరెస్ట్ చేసిన మేడ్చల్ పోలీసులు

హైదరాబాద్, ఆగష్టు 15: అక్రమ సరోగసీకి పాల్పడుతున్న వ్యక్తుల్ని, ఎగ్ డొనేట్ చేస్తున్న వారిని అరెస్ట్ చేశామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు మొత్తం 8 మంది కమర్షియల్ సరోగసీ, అక్రమ ఎగ్ ట్రేడింగ్ చేస్తూ పట్టుబడ్డారని డీసీపీ తెలిపారు. పిల్లలు లేని జంటలను టార్గెట్ గా చేసుకుని నిందితులు 15– 20 లక్షలు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మి గతంలో ఎగ్ డోనర్, సరోగసి మదర్‌గా పని చేసిన అనుభవం ఉందని .. గత అనుభవంతో సులభ పద్ధతిలో డబ్బులు సంపాదించాలని అక్రమ సరోగసి విధానానికి తెరలేపి ఏజెంట్లుగా పనిచేస్తున్నారని డీసీపీ తెలిపారు.

లక్ష్మి రెడ్డి కుమారుడు ఎ2 నిందితుడు నరేందర్ రెడ్డి జేఎన్‌టియులో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడని, అమ్మకి తోడుగా ఈ వ్యాపారంలోకి దిగాడని డీసీపీ చెప్పారు. డబ్బు అవసరం ఉన్న పేద మహిళలను టార్గెట్ గా చేసుకుని ఎగ్ డొనేట్ చేయించడంతోపాటు, సరోగసికి ఒప్పిస్తున్నారని, నిందితుల దగ్గర నుంచి 6.47 లక్షల నగదు, లెనోవో ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సిరంజీలు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజెక్షన్లు, హెగ్డే హాస్పిటల్ కేస్ షీట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీళ్లిద్దరూ కొన్ని హాస్పిటల్స్ కు ఏజెంట్లకు పనిచేస్తున్నారని డీసీపీ తెలిపారు. సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ యాక్ట్, బిఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్ట్ చేశామన్నారు.




# బాలగోపాలుడి జన్మదినం - శ్రీ కృష్ణాష్టమి పర్వదినం

## (16 ఆగష్టు "శ్రీ కృష్ణ జన్మాష్టమి" శుభ పర్వదినం సందర్భంగా)

హిందూ పురాణ గ్రంథాల ప్రకారం, మాత దేవకి, వాసుదేవుడు దంపతులకు మధుర నగరంలో అష్టమి తిథి భాద్రపద మాస కృష్ణ పక్షం 8వ రోజు వృషభ లగ్నం రోహిణి నక్షత్ర శుభ సమయాన అర్ధరాత్రి జన్మించాడు శ్రీ కృష్ణ పరమాత్ముడు. రాక్షస ప్రవృత్తి కలిగిన కంసుడు కారాగారంలో బంధించిన వేళ ఆ దంపతులకు పుట్టిన చిన్ని కృష్ణున్ని బృందావనంలో యశోద నందుల ఇంటికి చేర్చిన విషయం మనకు తెలుసు. శ్రీ విష్ణువు దశావతారాల్లో 8వ అవతారంగా జగన్నాథుడు జన్మించిన శుభ గడియలను కృష్ణాష్టమి , జన్మాష్టమి, గోకులాష్టమి, శతమానం, శ్రీ కృష్ణ జయంతి, శ్రీ జన్మాష్టమి, లేదా అష్టమి రోహిణి అనబడే పలు పేర్లతో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రపంచ హిందూ సమాజం నిర్వహించుకునే ఒక ముఖ్యమైన పండుగగా దీనికి ప్రాధాన్యం ఉన్నది. నిజానికి కృష్ణాష్టమి తిథి 15 ఆగష్టు 2025 రాత్రి 11:49 గంటలకు ప్రారంభమై16 ఆగష్టు 2025 రాత్రి 09:34 గంటలకు ముగుస్తుంది. దీనిని గమనించిన పంచాంగకర్తలు 16 ఆగష్టు 2025న శ్రీ కృష్ణ జన్మాష్టమి జరుపుకోవాలని నిర్ణయించారు. ఈసారి శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు భరిణ, కృత్తిక, రోహిణి నక్షత్రాల కలయిక కూడా ఉండటంతో నేటి పండుగకు మరింత విశిష్టత చేకూరింది.

భక్తిశ్రద్ధలతో బాలగోపాలుడికి పూజలు:

ఈ పవిత్ర రోజున బాల గోపాలుడికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేస్తారు. బాల కృష్ణుడి రూపమైన లడ్డూ గోపాలుడికి స్నానం చేయించి, నూతన వస్త్రాలు ధరింపజేసి, పంచామృతాలు, వెన్న, తులసి దళాలు సమర్పిస్తారు. కృష్ణాష్టమి రోజు కృష్ణున్ని పూజిస్తే అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సొంతం అవుతాయని నమ్ముతారు. ఈ పర్వదినం రోజున ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఇస్కాన్ రాధా గోవింద మందిరాల్లో భక్తులంతా "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే" నామాన్ని జపిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు చేయడం కొనసాగుతున్నది. గోపాలుడి ఫోటోకు పుష్పాలతో పూజలు చేస్తూ "శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః" అనే మంత్రాన్ని 21 లేదా 54 లేదా 108 సార్లు మనసారా జపిస్తారు. పూజలో భాగంగా నల్లనయ్యకు నైవేద్యంగా అటుకుల ప్రసాదాన్ని సమర్పిస్తారు. దేశవ్యాప్తంగా అనేక కృష్ణ మందిరాలు ఉన్నప్పటికీ మహారాష్ట్రంలో విఠోబా, రాజస్థాన్‌లో శ్రీనాథ్ జీ, ఉడిపిలో కృష్ణుడు, కేరళలో గురువాయురప్ప, యూపీలో బృందావనం, తమిళనాడులా పార్థసారథి, గుజరాత్‌లో ద్వారక, ఒడిసాలో పూరీ క్షేత్రాలు ప్రత్యేక కన్నయ్య మందిరాలుగా పేరుగాంచాయి.

హైందవ ధర్మానికి సంబంధించిన జన్మాష్టమి పండుగను గొప్ప ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పర్వదినంలో భాగంగా ప్రత్యేక భజనలు, నృత్యాలు, కీర్తనలు ఆలపించడం ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. శ్రీ కృష్ణుడి జీవితం, గీతోపదేశం మన జీవన ప్రయాణంలో సన్మార్గాలను బోధిస్తున్నది. కృష్ణుడి జీవితం జ్ఞానం, శాంతి, ప్రహిత భావనలు, ప్రేమ, భక్తి, కరుణ, సత్యమార్గం లాంటి గుణాలను బోధిస్తున్నది. పుర వీధుల్లో ఉట్లు కొట్టే పోటీలు కూడా నిర్వహిస్తారు. బాల కృష్ణుడిని పూజించడం ద్వారా కష్టనష్టాలు, దుఃఖం, దోషం, దారిద్ర్యం తొలగిపోతాయని నమ్ముతారు.

"ఓం నమో భగవతే వాసుదేవాయ"

"శ్రీ కృష్ణార్పణమస్తు" !

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గ్రామ గ్రామాల్లో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



సంగారెడ్డి ఆగస్టు 15 (నేటి నిజం ప్రతినిధి) 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీ పట్టణాల్లో, గ్రామ పంచాయతీలలో గల ప్రతి గ్రామములో అన్ని కార్యాలయాలపై మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాల నాయకులు వారి వారి కార్యాలయాలపై త్రివర్ణ జెండా ను ఎగరవేశారు. నారాయణఖేడ్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ప్రైమరీ మరియు హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ , అధికారులు అనాధికారులు గ్రామ పెద్దలు కలిసి స్వతంత్ర పోరాట సమరయోధులను జ్ఞాపకం చేసుకొనుచు ఊరంతా జై జైలు కొడుతూ జెండాలను ఎగరవేశారు. గ్రామ నడిబొడ్డులోని గాంధీ విగ్రహం వద్ద, చావిడి వద్ద, హనుమాన్ మందిర్ కూడలి వద్ద, ఆరోగ్య కేంద్రం వద్ద, అనంతసాగర్ హై స్కూల్ ఆవరణములో సామూహికంగా ఉన్న మూడు అంగన్వాడీల వద్ద, ప్రైమరీ మరియు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అందులోనే ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయం పై గ్రామ పంచాయతీ సెక్రెటరీ మువ్వన్నెల జెండాలను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ గ్రామ సర్పంచ్ రాజు , గ్రామ పెద్దలు మోహన్ రెడ్డి, అంజిరెడ్డి, శివారెడ్డి, బుసిరెడ్డి, సికిందర్ రెడ్డి, సిద్దు, దేవదాస్ , లోకేష్ రెడ్డి , హనుమంతు , మనోహర్ పాటిల్, గ్రామ అధికారులు అనధికారులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో స్వాతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

# హానికరమైన లింకులూ, మెసేజుల ఆటకట్టు: బీఎస్ఎన్ ఎల్

న్యూఢిల్లీ, ఆగష్టు 15:దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న తన నెట్వర్క్ ద్వారా మొబైల్ వినియోగదారులకు ఎలాంటి యాప్ అవసరం లేకుండా, ఫోన్లో ఎలాంటి మార్పులూ చేయాల్సిన అవసరం లేకుండా యాంటీ-స్పామ్, యాంటీ-స్మిషింగ్ రక్షణను అమలు చేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఈ రోజు ప్రకటించింది. ఎస్ఎంఎస్‌లో అనుమానాస్పద, మోసపూరిత యూఆర్ఎల్స్ ఉంటే వాటిని ముందుగానే గుర్తించి నెట్వర్క్ స్థాయిలోనే అడ్డుకొని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నకిలీ లింకులు చేరకుండా ఆపుతాయి. అయితే ట్రాయ్ డీఎల్‌టీ/యూసీసీ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన ఓటీపీలు, బ్యాంకింగ్, ప్రభుత్వ సందేశాలు వస్తాయి. ఈ పరిష్కారాన్ని ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2024లో పరీక్షించారు. కొనసాగుతున్న కార్యకలాపాల్లో భాగంగా బీఎస్ఎన్ఎల్ సర్కిళ్లలో దీన్ని అమలు చేస్తారు.

భారత్ కేంద్రంగా పనిచేసే ప్రముఖ క్లౌడ్ కమ్యూనికేషన్ల కంపెనీ-తాన్లా సాయంతో దీనిని అమలు చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఏఐ/ఎంల్, ఎన్ఎల్‌పీ, రెప్యుటేషన్ ఇంటిలిజెన్స్, లింక్ ఎక్స్‌టెన్షన్లను మిళితం చేసి, సందేశాలను లైన్-రేటు వద్ద లెక్కిస్తుంది. అలాగే అవాంఛిత వాణిజ్య సమాచారాన్ని నిలువరించేందుకు భారతీయ టెలికాం సంస్థలు ఇప్పటికే వినియోగిస్తున్న ఇండస్ట్రీ బ్లాక్ చెయిన్ డీఎల్‌టీ స్టాక్‌తో కలసి పనిచేస్తుంది. కొత్త ప్రచారాలను వేగంగా తటస్థీకరించడానికి వ్యవస్థల ఏకీకరణతో (ఉదాహరణకు ప్రధాన వెబ్, మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లు) స్మిషింగ్‌ను గుర్తించడంలో, జాతీయ స్థాయి నిర్వహణలో ఈ సాంకేతికతకు 99 శాతానికి పైగా సామర్థ్యం ఉందని గుర్తించారు.

# పేలిన సిలిండర్..

బెంగళూరు, ఆగష్టు 15: సెంట్రల్ బెంగళూరులోని విల్సన్ గార్డెన్, చిన్నయనపాల్య ప్రాంతంలో జరిగిన సిలిండర్ పేలుడు? తీవ్ర విషాదానికి కారణమైంది. ఈ ఘటనలో 10 ఏళ్ల ముబారక్ అనే బాలుడు మృతి చెందగా, 12 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు.

పేలుడు ధాటికి పక్కన ఉన్న 8 నుంచి 10 ఇళ్లు పూర్తిగా కూలిపోగా, చుట్టుపక్కల ఉన్న పలు భవనాల గోడలు, పైకప్పులు దెబ్బతిన్నాయి. సమీప ప్రాంతాలలో కూడా ప్రకంపనలు సంభవించాయి. వెంటనే అగ్నిమాపక దళానికి కాల్ వెళ్లగా, రెండు ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. ఔఆఖీఈ, పోలీసులు, అత్యవసర సేవా బృందాలు శిథిలాల తొలగింపు ఆపరేషన్ ప్రారంభించాయి.

అగ్నిమాపక శాఖ ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, గ్యాస్ సిలిండర్ లీక్ కావడం వల్లే ఈ పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. "ప్రాథమిక పరిశీలనలో సిలిండర్ పేలుడు జరిగినట్టు తేలింది. అయితే ఖచ్చితమైన కారణం తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోంది" అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

### సీఎం సంతాపం.. ఆర్థిక సాయం ప్రకటింపు

ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన బాలుడి కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.

జాగ్రత్తలు అవసరం..

ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలుళ్లు తరచుగా జరుగుతున్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, లీకేజీలను నిర్లక్ష్యం చేయడం, పాత పైపులు వాడటం, గడువు ముగిసిన సిలిండర్లు వినియోగించడం ఇవన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిపుణులు సిలిండర్‌ను సురక్షితంగా వినియోగించాలంటూ ప్రజలకు అవగాహన పెంచుతున్నారు.

ఈ ప్రమాదంతో విల్సన్ గార్డెన్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

సంగారెడ్డి ఆగస్టు 15(నేటి నిజం ప్రతినిధి)79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్ర వారం నిర్వహించిన వేడుకలు, దేశభక్తి ఉత్సాహంతో, వైభవంగా నిర్వహించారు .

ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

అనంతరం జిల్లా ప్రగతి నివేదికను ప్రజలకు చదివి వినిపించారు.




వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా పంచాయతీ రాజ్, విద్యా శాఖ, వ్యవసాయ శాఖ , ఆరోగ్య సంబంధిత పథకాలు, పోలీస్ శాఖ, మున్సిపల్, రెవిన్యూ శాఖల శకటాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ఉద్యోగులకు మంత్రి ప్రశంస పత్రాలను అందజేశారు. పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, మిషన్ భగీరథ, మెప్మా, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను మంత్రి , టీ జి ఐ ఐ సి చైర్మెన్,జిల్లా కలెక్టర్ , సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సంచార విజ్ఞాన ప్రయోగశాల వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే హోమ్ అఫైర్స్ విభాగం మొబైల్ ఫోరెన్సిక్స్ వ్యాన్, క్లూస్ టీమ్ వాహనాన్ని కూడా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలి: జిల్లా కలెక్టర్ పి . ప్రావిణ్య.

## -సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

## -కలెక్టరేట్లో జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.

సంగారెడ్డి ఆగస్టు 15 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి కలెక్టరేట్లో 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి లతో కలిసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లో జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లోని ఉద్యోగులను నిర్దేశించి కలెక్టర్ మాట్లాడారు. స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతం కోసం ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, తదితర కార్యక్రమాల విజయవంతం



అధికారులు సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలి అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంలో జిల్లాలో మెరుగైన ఫలితాల సాధన కోసం అధికారులు సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## -జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

సంగారెడ్డి ఆగస్ట్ 15(నేటి నిజం ప్రతినిధి ): 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మువ్వన్నెల జెండాను ఎగరవేశారు.

ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మాతృభూమి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సాధించిన ఈ స్వాతంత్ర్య భారత్ నేడు 78 వసంతాలను పూర్తి చేసుకుందని అన్నారు. ఈ సందర్భంలో ఆ మహనీయులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని గుర్తుచేశారు. బానిస సంకెళ్ళను తెంచుకొని సాధించుకున్న ఈ స్వాతంత్ర్య భారత రాజ్యాంగాన్ని కొన్ని శక్తులు విచ్ఛిన్నం చేయడానికి




ప్రయత్నిస్తున్నాయని, భారతదేశం శత్రు దేశాలచే చుట్టుముట్టబడి ఉన్న దేశాల నుండి, అంతర్గత శత్రువుల ముప్పుల నుండి దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని, పోలీసులుగా మన పాత్ర అత్యంత కీలకమని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు మన విధులు, సమాజానికి అందించాల్సిన సేవలను గుర్తు చేసే వేడుకలని, భిన్న భాషలు, జాతులు, మతాల సమ్మిళితం మన భారతదేశం అని, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలున్న వ్యక్తులు మరియు సమూహాల మధ్య సామరస్యం, ఐక్యత భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. భారతీయులుగా పుట్టినందుకు ప్రతి ఒక్కరం గర్వపడాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మన విధులను నిబద్ధతతో, అంకితభావంతో నిర్వర్తిస్తే సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికుల త్యాగాలకు సమానంగా మన సేవలు నిలుస్తాయని గుర్తుచేశారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అదే ధృఢసంకల్పంతో తమ కర్తవ్యాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు

ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారు ఇ. కళ్యాణి, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, డి4సి డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎఆర్. డి.యస్.పి ఎ.నరేందర్, యస్.బి. ఇన్స్పెక్టర్స్ కిరణ్ కుమార్, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ రమేష్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఆర్.ఐ. లు రామరావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, యస్.బి.,డి.సి.ఆర్.బి. యస్.ఐ. లు, డి.పి.ఒ సూపరింటెండెంట్ లు అశోక్, మోహనప్ప, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కరణ, స్వావలంబన, ప్రతి భారతీయుడికి సాధికారత కల్పించే దార్శనికత

న్యూఢిల్లీ, ఆగష్టు 15:79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ.. భారతదేశ స్వావలంబన, పరివర్తన ప్రయాణాన్ని ప్రధానంగా తెలియజేశారు. గత దశాబ్దంలో సంస్కరణలు, గణనీయమైన పనితీరుతో భారత్ పరివర్తన చెందిందని.. కానీ ఇప్పుడు మరింత శక్తి సామర్థ్యాలతో ముందుకు సాగాల్సిన సమయం అసన్నమైందని అన్నారు. చట్టాలు, నిబంధనలు, వివిధ ప్రక్రియలు సరళీకృతంగా ఉండే.. పారిశ్రామిక వాతావరణానికి ప్రోత్సాహం లభించే, ప్రతి భారతీయుడు వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడే విధంగా ఆధునిక, సమర్థవంతమైన, ప్రజలకు అనుకూలమైన వ్యవస్థను సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

### చట్టాలు, నిబంధనల సరళీకరణ

ప్రధాన మంత్రి మోదీ ప్రసంగం ప్రారంభంలో గడిచిన కాలంలో ప్రభుత్వం చారిత్రాత్మక సంస్కరణలు చేపట్టిందని అన్నారు. 40,000 కంటే ఎక్కువ అనవసరమైన నిబంధనలతో పాటు 1,500 కంటే ఎక్కువగా కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా డజన్ల కొద్దీ ఇతర చట్టాలను పార్లమెంటు సరళీకృతం చేసినట్లు తెలిపారు.

ఇటీవలి సమావేశాల్లోనే 280 కంటే ఎక్కువ నిబంధనలు తొలగిపోయాయి. ఇవి పరిపాలనను సులభతరం చేయటమే కాకుండా ప్రతి భారతీయుడికి ప్రభుత్వాన్ని మరింత అందుబాటులోకి తెచ్చాయి. సంస్కరణలు కేవలం ఆర్థికమైన అంశాల గురించి మాత్రమే కాదని, ప్రజల దైనందిన జీవితాలను మార్చడం గురించని ప్రధాని మోదీ ప్రధానంగా పేర్కొన్నారు.

సామాన్య ప్రజలు సులభంగా న్యాయం, సాధికారతను పొందగలిగే ఆధునిక, పౌర కేంద్రీకృత ప్రభుత్వం దిశగా ఈ సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ఉన్న దేశాన్ని నిర్మించే దిశగా నిర్మాణాత్మక, నియంత్రణ పూర్వక, విధానపరమైన, ప్రక్రియాత్మక సంస్కరణలకు భారత్ కట్టుబడి ఉందన్నారు.

### పారిశ్రామిక వ్యవస్థాపన, ఎంఎస్ఎంఈలకు సాధికారత కల్పించడం

అంకురాలు, ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక వ్యవస్థాపకులకు చట్టపరమైన ఖర్చులను తగ్గించాలని ప్రభుత్వ సంస్కరణలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అదే సమయంలో కాలం చెల్లిన చట్టపరమైన నిబంధనల నుంచి కూడా ఇవి విముక్తిని అందిస్తున్నాయి. ఇది వ్యాపార వృద్ధికి మరింత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించటంతో పాటు ఆవిష్కరణ, ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహిస్తోంది.

### తదుపరి తరం సంస్కరణలు, కార్యాచరణ బృందం

తదుపరి తరం సంస్కరణల కోసం ఒక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి ఉన్న అన్ని చట్టాలు, నియమాలు, విధానాలను నిశితంగా పరిశీలించనుంది. ఇది నిర్ణీత కాలక్రమంలో పని చేస్తుంది:

రోజువారీగా వినియోగించే వస్తువులపై పన్నులను తగ్గించే లక్ష్యంతో ఈ దీపావళి నాటికి తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలను ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. "సామాన్యులపై పన్ను భారాన్ని తగ్గించే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలను ప్రభుత్వం తీసుకొస్తుంది. ఇది మీకు దీపావళి బహుమతి అవుతుంది'' అని వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తాయని, ఆర్థిక కార్యకలాపాలకు ఊతం ఇస్తాయని అన్నారు.

ఇతరులు పెట్టే పరిమితులపై దృష్టి పెట్టడానికి బదులుగా భారతదేశం తన సొంత పురోగతిని వేగవంతం చేసుకోవాలని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆర్థికంగా స్వార్థ ప్రయోజనాలు పెరుగుతోన్న ప్రస్తుత ప్రపంచంలో భారత్ సామర్థ్యాలను పెంచటం, అవకాశాల పరిధిని విస్తరించడం, ప్రజలకు సాధికారత కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సంస్కరణలు ప్రభుత్వపరమైన పరివర్తనలో వేగవంతమైన దశకు నాంది వంటివని అన్నారు. ఇవి భారత్ మరింత ధృడంగా, సమ్మిళితంగా మారుస్తాయని.. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేలా చూసుకుంటాయని అన్నారు.

# వెలుగులోకి మరో సృష్టి..

హైదరాబాద్, ఆగష్టు 15: హైదరాబాద్ లోని మాదాపూర్ ప్రాంతం మరోసారి సంచలనానికి కేంద్రబిందువైంది. అక్రమ సరోగసి, ఎగ్ ట్రేడింగ్ ముఠా గుట్టు రట్టయింది. రెండు ఫెర్టిలిటీ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ జరుగుతున్న ఈ కార్యకలాపాలపై పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి కీలక సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో తల్లి-కొడుకు అరెస్టు కావడం, అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా అనుబంధాలు బయటపడడం కలకలం రేపుతోంది. డబ్బు అవసరం ఉన్న పేద మహిళ లను ఎంచుకున్న తల్లీ కొడుకులు ఎగ్ డోనర్, సరోగసి మదర్ గా ఒప్పందాలు చేసి డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు.

# తొలి స్వాతంత్ర్య వేడుకల్లో గాంధీజీ ఎందుకు పాల్గొనలేదు?

న్యూ ఢిల్లీ ఆగస్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అది 1947 ఆగస్టు 15.. ఎన్నో ఏండ్ల బానిస బతుకుల నుంచి విముక్తి లభించిన రోజు. ఆనాడు రాజధాని ఢిల్లీ సహా దేశమంతటా ప్రజలు సంబురాలు జరుపుకుంటున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ సహా చాలామంది స్వతంత్ర్య సమరయోధులు, ప్రజలు ఢిల్లీ నగరానికి చేరుకుని సంబురాలు చేసుకుంటున్నారు. కానీ స్వరాజ్య స్థాపన కోసం తుదివరకు అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడిన మహాత్మా గాంధీ మాత్రం ఢిల్లీలో లేరు. ఢిల్లీకి దూరంగా కలకత్తా వెళ్లారు. అక్కడ కూడా సంబురాల్లో పాల్గొనలేదు. రోజంతా ఉపవాసం చేస్తూ మౌనదీక్ష పూనారు.ఎన్నో ఏండ్లుగా కలలు కన్న స్వరాజ్యం వచ్చిన రోజునే భారతదేశం రెండు ముక్కలైంది. మత ప్రాతిపాదికన భారత్, పాకిస్థాన్‌గా విడిపోయింది. ఆ సమయంలో హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. దీంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే ఆనందం కంటే కూడా.. దేశం రెండుగా చీలిపోయిందనే బాధే గాంధీజీలో ఎక్కువగా ఉండిపోయింది. అదే సమయంలో బెంగాల్‌లో గొడవలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిసి బాపూజీ కలత చెందారు. వెంటనే కలకత్తా బయలుదేరి వెళ్లారు. బెంగాల్‌లో శాంతి నెలకొంటే దేశవ్యాప్తంగా హిందూ, ముస్లింల మధ్య వివాదాలు సద్దుమణుగుతాయన్నది గాంధీజీ నమ్మకం. అందుకే 1947 ఆగస్టు 9న ఆయన కలకత్తాకు వెళ్లారు. బంగ్లాదేశ్‌లో ఉన్న నౌకాలి ప్రాంతంలో ఎక్కువగా మత ఘర్షణలు జరుగుతున్నాయని తెలిసి.. అక్కడికి కూడా వెళ్లాలని గాంధీ అనుకున్నారు. కానీ చాలామంది అడ్డుతగిలి ఆయన్ను బంగ్లాదేశ్‌లోకి వెళ్లనివ్వలేదు. దీంతో మియాబగన్ సమీపంలో ఉన్న హైదరీ మంజిల్‌లో బాపూజీ బస చేశారు. కానీ అప్పటికే గాంధీజీపై ముస్లింల నుంచి వ్యతిరేకత మొదలైంది. ముస్లిం వ్యతిరేకి గాంధీ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో ముస్లింలు ఆందోళనలు చేశారు. అయినా గాంధీ వెనక్కి తగ్గలేదు.రోజురోజుకీ ఆందోళనలు ఎక్కువైపోతుండటంతో.. వాటిని ఆపేందుకు ఆగస్టు 13 ఘర్షణల్లో చురుగ్గా పాల్గొంటున్న వారితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాల వారితో భేటీ అయి నచ్చజెప్ప ప్రయత్నం చేశారు. కానీ వాళ్లెవరూ గాంధీ మాటలను వినేందుకు సుముఖంగా లేరు. కానీ గాంధీజీ మాత్రం తన ప్రయత్నాన్ని విడిచిపెట్టలేదు. శాంతియుతంగా వారితో చర్చలు జరుపుతూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఆగస్టు 15వ తేదీన గాంధీజీ 24 గంటల పాటు ఉపవాసం ఉండి ప్రార్థనలు చేశారు. మౌనంగా ఉంటూ చరఖా తిప్పుతూ గడిపేశారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే వివాదం మొత్తం సద్దుమణిగింది. మత ఘర్షణలు తగ్గుముఖం పట్టాయి. ఇదంతా గమనించిన లార్డ్ మౌంట్ బాటెన్.. పంజాబ్‌లో 55 వేల మంది సైనికులను పెట్టి కూడా ఆందోళనలను ఆపలేకపోయాం.. కానీ బెంగాల్‌లో మాత్రం ఒకే ఒక వ్యక్తి వీటిని నిలవరించాడని పేర్కొనడం విశేషం.కలకత్తాలో శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నించి సఫలీకృతుడైన గాంధీజీని అభినందించేందుకు సి. రాజగోపాలాచారి అక్కడికి వెళ్లారు. అయితే ప్రజలు ఒక్కటిగా లేనప్పుడు ఈ స్వాతంత్ర్యం తనకు ఆనందం ఇవ్వలేదని ఆ సందర్భంగా రాజగోపాలాచారితో గాంధీ చెప్పాడు. హిందూ, ముస్లింలు మళ్లీ కలిసి ఉంటే తప్ప నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదని ఆయన పేర్కొన్నాడు. కలకత్తా తర్వాత భారత్, పాకిస్థాన్‌లోని హిందూ, ముస్లింల మధ్య శాంతిని నెలకొల్పాలని గాంధీ ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో ఉండగానే గాంధీని గాడ్సే హత్య చేశాడు.

# శూన్యం నుంచి సునామిని సృష్టించిన నాయకుడు కేసీఆర్

## - పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంశల వర్షం

హైదరాబాద్ ఆగస్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): శూన్యం నుంచి



సునామిని సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను భారత పార్లమెంట్‌కు చేరేలా ఉద్యమ నిర్మాణాన్ని చేయడం ఆశామాషీ వ్యవహారం కాదు. 'తల్లికి జన్మనిచ్చిన తనయుడు ఇతడు' అని గోరటి వెంకన్న కేసీఆర్‌ను ప్రశంసించడం ఏమాత్రం అతిశయోక్తి కాదు అని కేటీఆర్ అన్నారు. మహేంద్ర తోటకూరి రచించిన ప్రజా యోధుడు పుస్తకాన్ని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించి మాట్లాడారు.2004లో భారతదేశానికి తిరిగి వచ్చి ఉద్యోగం చేస్తూనే 2006 వరకు జయశంకర్ సార్, విద్యాసాగర్ సార్, కేసీఆర్‌తో గడిపే అవకాశం దక్కింది. ఈ రెండు సంవత్సరాల కాలంలో చాలా అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కలిగింది. పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, చరిత్రలో జరిగిన అంశాలపై అవగాహన పెంచుకున్నాను. రాష్ట్రం సాధించిన తర్వాత ఎవరైనా ఏదైనా మాట్లాడవచ్చు, కేసీఆర్ ఏం చేశాడని కొట్టిపారేయవచ్చు. కానీ 25 ఏళ్ల కిందటి పరిస్థితి మాత్రం ఇలా లేదు. ఆ రోజు కేంద్రంలో వాజపేయి నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలో ఉంది. ఎన్డీఏ కన్వీనర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలంగాణ బద్ధ వ్యతిరేకి చంద్రబాబునాయుడు ఉన్నారు. మరోవైపు తెలంగాణ దుర్భర పరిస్థితికి కారణమైన వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ చాలా బలంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ కోసం ఒక పార్టీ పెట్టి, రాజకీయ శక్తిగా ప్రజల ఓట్లను ఆయుధంగా చేసుకొని పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును పాస్ చేయించుకొని రాష్ట్రాన్ని సాధించుకుంటామని చెప్పడం దుస్సాహసం అని కేటీఆర్ పేర్కొన్నారు.కాంగ్రెస్, కమ్యూనిస్టు, బీజేపీ వంటి జాతీయ పార్టీలు, తెలుగుదేశం, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలు మాత్రమే ఇవాళ నిలదొక్కుకున్నాయి. కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు, ప్రపంచమంతా కుగ్రామంగా మారుతుంటే, సరిహద్దులు చెరిగిపోతుంటే ఇంకా ప్రాంతీయ తత్వాలు ఏమిటని విమర్శించారు. పదవి రాకపోతే తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుంటారు, పదవి రాగానే ఆ జెండాను పక్కన పెడతారన్న అపనమ్మకం తెలంగాణ సమాజంలో బలంగా ఉండేది. 1971లో తెలంగాణ ప్రజా సమితి బ్యానర్ మీద 11 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచి కాంగ్రెస్‌లో విలీనం కావడం వల్ల, 370 మంది ఆత్మబలిదానాలు వృథా కావడంతో ఇక తెలంగాణ రాదన్న నిరాశ ప్రజల్లో ఉండేది. ఎన్టీఆర్, ఎంజీఆర్ లాగా కేసీఆర్ సినిమా స్టార్ కాదు. ఆయనకు కుల బలం, ధన బలం, మీడియా పవర్, బలగం ఏమీ లేవు. అలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను తట్టుకొని పార్టీ పెట్టి, రాజకీయ లక్ష్యాలను సాధించాలంటే ఎంత కష్టమో, గమ్యం తెలియని ప్రయాణం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. పార్టీ పెట్టినప్పుడు కేసీఆర్ వయస్సు 47 ఏళ్లు. రాజకీయ నాయకులకు అది టేకాఫ్ టైం. ఆ సమయంలో ఒక లక్ష్యంతో ప్రజల కోసం ముందుకు రావడం సాధారణ సాహసం కాదు. దృఢ సంకల్పం, దైవ బలం ఉన్న యోధుడికే అది సాధ్యమవుతుంది, సామాన్యులకు కాదు అని కేటీఆర్ అన్నారు. 2001 నుంచి 2014 వరకు ఆయన పడ్డ కష్టం ముందు ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న కష్టం ఏమాత్రం కాదు. ఎన్నో ప్రతికూల శక్తులు అడ్డంగా ఉన్నప్పుడు, దుర్మార్గమైన రాజకీయ వ్యవస్థ పార్టీని చిదిమివేయాలని చూస్తున్నప్పుడు, తెలంగాణను నడిపే సమర్థత ఉందా అని మనల్ని అవహేళన చేస్తున్నప్పుడు కేసీఆర్ ఒక్కరే తెలంగాణ కోసం నిలబడ్డారు. మన భాష, మన యాసను సినిమాల్లో జోకర్లకు, విలన్లకు మాత్రమే ఉపయోగించారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ కోసం కొట్లాడాలంటే తెగింపు కావాలి. కలిసి వచ్చే కాలానికి నడిచొచ్చిన కొడుకులా కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమించారు. ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా ఏ రోజు నమ్మకాన్ని కోల్పోకుండా, ప్రజల మీదనే భారాన్ని ఉంచి, దేవుడి ఆశీర్వాదంతో తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్తున్న తాను తిరిగి తెలంగాణ గడ్డ మీదనే కాలు పెడతానని చెప్పాలంటే దానికి ఎంతో గుండె ధైర్యం కావాలి. "నేను ఎత్తిన జెండా దించితే రాళ్లతో కొట్టి చంపండి" అని 2001లో జరిగిన సింహగర్జనలో కేసీఆర్ ప్రజలకు చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు.ఆరు గ్యారెంటీలతో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయని నేటి రాజకీయ నాయకుల మధ్య అలాంటి మాటను ఊహించలేం. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అని చెప్పే గుండె ధైర్యం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. తెలంగాణ వచ్చాక ఒక అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని పునర్నిర్మించారు. పల్లెల్లో ఏమేమి ఉండాలో ఆలోచించిన ఒకే ఒక్క నాయకుడు భారతదేశంలో కేసీఆర్. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పట్టణాలను ఎలా విస్తరించాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్. అందుకే పదేళ్లలో మనం సాధించిన విజయాలు మామూలు కాదు. "ఉద్యమకారులు మంచి పరిపాలన చేయలేరని అనుకునేవాళ్లం, కానీ మీకు మాత్రం మంచి నాయకుడు దొరికాడని" గతంలో అరుణ్ జైట్లీ మాతో అన్నారు. సాధించిన రాష్ట్రానికే ముఖ్యమంత్రి కావడం అందరికీ దక్కే అదృష్టం కాదు, నువ్వు కారణజన్ముడవని ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కేసీఆర్‌ను మెచ్చుకొని ఆశీర్వదించారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

# రైతులు దేశానికి వెన్నెముక: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ ప్రశంస

న్యూఢిల్లీ, ఆగష్టు 15:79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ రైతులకు ప్రశంసలు అందించారు. పరాధీనత నుంచి స్వావలంబన దిశగా జరిగిన జాతి ప్రయాణంలో వారు వెన్నెముకగా నిలిచారన్నారు. వలస పాలన దేశాన్ని పేదరికంలో ముంచిందనీ, అయితే, రైతుల అవిశ్రాంత కృషి వల్లే భారత ధాన్యాగారాలు నిండి, దేశం పూర్తి స్వతంత్రతను సాధించిందన్నారు. రైతుల పట్ల కృతజ్ఞతా భావం, భారత వ్యవసాయం భవిష్యత్తు దార్శనికత ఆయన ప్రసంగంలో ప్రధానంగా చోటు చేసుకున్నాయి.

### రైతులు – భారత ప్రగతికి వెన్నెముక

దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రైతులు, పశు పోషకులు, మత్స్యకారులకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తోందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. వివిధ రంగాల్లో భారత్ స్థానం నేడు ఇలా ఉంది:

పాలు, పప్పుధాన్యాలు, జనపనార ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటి స్థానం.

బియ్యం, గోధుమలు, పత్తి, పండ్లు, కూరగాయల్లో రెండో స్థానం.

వ్యవసాయ ఎగుమతులు ఇప్పుడు రూ. 4 లక్షల కోట్లు దాటాయి. ప్రాంతీయంగా అంతరాలను మరింత తగ్గించడం కోసం ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనను ప్రభుత్వం ప్రకటించింది. 100 అత్యంత వెనుకబడిన వ్యవసాయ జిల్లాల అభివృద్ధి దీని లక్ష్యం.

"రైతులు, మత్స్యకారులు, పశు పోషకులకు మోదీ ఎప్పుడూ రక్షణ కవచంగా ఉంటాను" అంటూ తన నిబద్ధతను పునరుద్ఘాటించారు.

సింధు జలాల ఒప్పందం – దేశ ప్రయోజనాలే ప్రధానం

సింధూ జలాల ఒప్పందం న్యాయబద్ధంగా లేదన్న శ్రీ మోదీ.. ఇప్పుడున్న ఒప్పందం భారత రైతులకు కీడు చేసిందన్నారు. భారత్ ఇకపై ఈ తరహా ఏకపక్ష ఒప్పందాన్ని అంగీకరించబోదని, సొంత వ్యవసాయ క్షేత్రాలు, ప్రజల కోసం తనకు హక్కుగా ఉన్న నీటి వాటాను తిరిగి పొందుతుందని ఆయన ప్రకటించారు.

వ్యవసాయ స్వావలంబన.. ఎరువులు, ఉత్పాదకాలు

ఆహార భద్రత కోసం దిగుమతులపై ఆధారపడకూడదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. భారత రైతులు సాధికారత సాధించేలా, దేశంలో వ్యవసాయం స్వతంత్ర అభివృద్ధికి భరోసానిస్తూ... ఎరువులు, కీలక ఉత్పాదకాలను దేశీయంగా ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది రైతుల సంక్షేమానికే కాకుండా దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయడానికి కూడా కీలకమని ఆయన అన్నారు.

# తెలంగాణ తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోల్పోయింది

## - మళ్లీ బానిసత్వంలోకి పోయింది: కేటీఆర్

హైదరాబాద్ ఆగస్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : పంద్రాగస్టు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్



ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మళ్లీ బానిసత్వంలోకి పోయిందని, తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోల్పోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేటీఆర్ పాల్గొని, జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నో కులాలు, ఎన్నో మతాలు, ఎన్నో భాషలు, ఎన్నో రాష్ట్రాలు కలిగి ఉన్న వైవిధ్య భారతానికి స్వాతంత్రం సిద్ధించి 79 ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ తరపున బీఆర్ఎస్ తరపున హృదయపూర్వకంగా స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం బలిపీఠం ఎక్కిన వేలాది మంది త్యాగధనులకు, ఆనాటి నాయకత్వానికి వినమ్ర పూర్వక శ్రద్ధాంజలి. 14 రాష్ట్రాలతో మొదలైన స్వతంత్ర భారతదేశ ప్రయాణం ఇవ్వాళ 28 రాష్ట్రాల వైవిధ్య భారతంగా విలసిల్లుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.అతి చిన్న వయసు కలిగిన తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో మొత్తం భారతదేశానికే ఆదర్శంగా నిలిచింది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పోరాటం జరిపి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అభివృద్ధి, సంక్షేమం, తలసరి ఆదాయం, వ్యవసాయ విస్తరణలో అద్భుత విజయాలను సాధించి.. జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని కేసీఆర్ నాయకత్వం నిజం చేసింది. ఎక్కడో 14 స్థానంలో ఉన్న తెలంగాణ 10 ఏళ్లలోనే పంజాబ్, హర్యానాను వెనక్కి నెట్టి ధాన్యం ఉత్పత్తిలో అగ్రభాగాన చేరడానికి రైతును రాజునే చేయాలన్న కేసీఆర్ సంకల్పమే కారణం అని పేర్కొన్నారు.ఐటీ రంగం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, పల్లె ప్రగతి, పేద వారికి సంక్షేమ కార్యక్రమాలు ఇలా ఏ రంగం తీసుకున్న పదేళ్లలో భారత దేశానికే లైట్ హౌజ్‌లాగా తెలంగాణ నిలబడ్డది. 20 నెలల కాంగ్రెస్ పాలన చూస్తుంటే బాధ కలుగుతుంది. రైతులు రాజు చేయాలన్న కేసీఆర్ తపన పక్కకు వెళ్లిపోయింది. స్వాతంత్ర దినోత్సవం వేళ యూరియా కోసం రైతులు చాంతాడంత లైన్లలో చెప్పులు పెట్టి క్యూ కడుతున్నారు. మళ్ళీ ఆనాటి పాత కాంగ్రెస్ రోజులను రేవంత్ రెడ్డి తీసుకొచ్చిండు. స్వాతంత్ర్యం అంటే సొంతంగా పరిపాలించుకోవడమే కాదు ఆత్మగౌరవంతో బతకడం. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాటు ఆత్మగౌరవంతోనే బతికాం. కానీ ఇవ్వాళ మళ్లీ ఢిల్లీ పాలన తెలంగాణ ప్రజల నెత్తి మీద రుద్దపడిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.ఢిల్లీ కిరాయి పాలన మొదలైంది. ఢిల్లీ పార్టీల పెత్తనం తెలంగాణలో నడుస్తుంది. 51 సార్లు ఢిల్లీకి ముఖ్యమంత్రి అప్ అండ్ డౌన్ చేశారు. ప్రతి చిన్న పనికి కూడా ఢిల్లీ వైపే చూడాల్సిన దుస్థితి ఇవాళ తెలంగాణలో ఉంది. తెలంగాణ మళ్లీ బానిసత్వంలోకి పోయింది. తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోల్పోయింది. సంక్షేమంలో, వ్యవసాయంలో వెనుకబడ్డది. ఐటీ, పరిశ్రమలు తరలిపోతున్నాయి, దానికి ఢిల్లీ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కారణం. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పెద్దలు జయశంకర్ సార్ వేల సార్లు చెప్పారు. సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి. ఆత్మగౌరవంతో బతకాలి. పేదలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జయశంకర్ సార్ చెప్పేవారు. ఇవన్నీ జరగాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అన్న మాటను మీ అందరికి గుర్తు చేస్తున్నాను. కులం, మతం లాంటి ఎన్నో అంశాలు మనల్ని విడదీయవచ్చు. కానీ మనందరినీ కలిపి ఉంచేది భారతీయత ఒక్కటే అని కేటీఆర్ పేర్కొన్నారు.

# జిఎస్టి విధానంలో కొత్త తరం సంస్కరణలు

## -స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభవార్త

న్యూఢిల్లీ ఆగష్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభవార్త చెప్పారు. ఈసారి దీపావళి రెండింతల ఆనందాన్ని తీసుకురాబోతున్నది అంటూ.. వస్తు,సేవల పన్ను (ఊూ) విధానంలో కొత్త తరం సంస్కరణలను తీసుకువస్తున్నామని వెల్లడించారు. సామాన్యులపై భారం తగ్గించేలా పన్నుల్లో భారీగా కోత పెట్టనున్నామని, ఈసారి దీపావళి కానుకగా ఇవ్వబోతున్నామని ఎర్రకోట వేదికగా ప్రకటించారు. 'వెలుగుల పండుగ వచ్చేలోగా రాష్ట్రాలతో చర్చించి జీఎస్టీలో కీలకమైన మార్పులు, చేర్పులు చేస్తాం. సామాన్యులపై పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించి, భారీ ఉపశమనాన్ని కలిగించేలా తమ సంస్కరణలు ఉంటాయి. వీటివల్ల చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు, ఎంఎస్ఎంఈలకు భారీ ప్రయోజనం చేకూరుతుంది. జీఎస్టీ సంస్కరణల తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది.ప్రతి కుటుంబానికి ఉపశమనం కలిగించేలా నిత్యావసర వస్తువులపై విధించే పన్నును తగ్గిస్తున్నాం. వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించవే లక్ష్యంగా జీఎస్టీ స్లాబులను మార్పుచేస్తున్నాం. ఈ దీపావళి నాటికి సామాన్యుల జీవితాన్ని మరింత సులభతరం చేసేలా, సరళీకృత జీఎస్టీ విధానాన్ని మీరు చూస్తారు. హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి జీఎస్టీ సంస్కర్ణలు జరిపి ఈ దీపావళికి బహుమతిగా ఇస్తాం. సంస్కరణల విషయంలో ప్రతిఒక్కరు మాకు మద్దతు పలకాలి.అన్ని రంగాల్లోనూ సంస్కరణలు తెస్తున్నాం, ఈవిషయంలో వెనకడుగు వేసేది లేదు. ఏ నిర్ణయం తీసుకున్నా దేశ హితం కోసమే. విధాన, నిర్మాణాత్మక, ఆర్థిక సంస్కరణల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. మార్పు అవసరమైన ప్రతిచోటా సంస్కరణలకు భారత్ సిద్ధంగా ఉంది. నగదు బదిలీ పథకం సామాన్య పేదలకు వరంగా మారింది. 25 కోట్ల మంది పేదలను దిగువ మధ్యతరగతి స్థాయికి తీసుకొచ్చింది. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి సంయుక్త బలం భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నది. నైపుణ్యాభివృద్ధితో భారత యువత స్వయం ఉపాధి రంగాల్లో ముందడుగు వేస్తున్నది. ఎంతోమంది త్యాగధనుల వల్ల మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇప్పుడు మనం స్వయం సమృద్ధిని సాధించాలి. స్వయం సమృద్ధి అనే పదాన్ని మన నరనరాల్లో జీర్ణించుకోవాలి. స్వదేశీ అనే పదం బలహీనత కాదు, అది మన బలంగా చాటిచెప్పాలి. నాణ్యత విషయంలో రాజీపడొద్దని వ్యాపారులను అర్థిస్తున్నా. నాణ్యత అనేది మన దేశ బ్రాండ్ కావాలి' అని మోదీ అన్నారు.

# స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ స్వాభిమాన పరిషత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




హైదరాబాద్ ఆగష్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ స్వాభిమాన పరిషత్ ఆధ్వర్యంలో(మలక్పేట్) సైదాబాద్ లో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన వారిని గుర్తుచేస్తూ అలాగే దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారికోసం ఈ రక్తదాన శిబిరాన్ని అంకితం చేస్తున్నట్లు స్వాభిమాన పరిషత్ కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ తెలిపారు. స్వాభిమాన పరిషత్ ఆద్వర్యం లో గత 20 సంవత్సరాలుగా పార్టీ లకు అతీతంగా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటికి స్వాతంత్ర సిద్ధించి 79 సంవత్సరాలు కాస్తున్నప్పటికీ దేశంలో యువత ఆశించిన మేరకు ముందుకు వెళ్ళకుండా పెడదారిన పట్టి చెడు మార్గాలలో పయనిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువతకు దిశా నిర్దేశం చేసారు.దేశాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత యువతపై ఎంతైనా ఉందని, డ్రగ్స్ పొగాకు మందు వంటి వ్యసనాల బారిన పడకుండా యువత చెడు మార్గంలో పయనించకుండా చూడవలసిన భాద్యత సమాజం పై ఉందన్నారు., నేను రాష్ట్రంలో మత్తు పదార్థాల నిషేధం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమం లో రాజకీయవేతలు.. తీగల కృష్ణారెడ్డి ,మాజీ మంత్రి శ్రీకృష్ణ యాదవ్, ఓబి అధ్యక్షులు అంజాదుల్లా ఖాన్ ,తెలంగాణ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ అధ్యక్షులు ఆర్ నవీన్ కుమార్, తెలంగాణ స్వామి కో కన్వీనర్ ఎస్ నర్సింగ్ రావు,స్థానిక కార్పోరేటర్ అరుణ, ప్రమోద్ ,ఓబీఖూ నాయకులు తో పాటు నవ యువత పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది .

# ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అందుకున్న సిరిసిల్ల అదనపు ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ను అదనపు ఎస్పీ చంద్రయ్య అందుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ డీ చంద్రయ్యకు భారత ప్రభుత్వం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ కి ఎంపిక చేయగా శుక్రవారం గోల్కొండ ఖిల్లాలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అందుకున్న డీ చంద్రయ్యను జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే అభినందించారు.

ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన డీ చంద్రయ్య 1991 సంవత్సరంలో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరి శిక్షణ అనంతరం ఎస్సై తొలిసారిగా కొత్తగూడ పోలీస్ స్టేషన్ వరంగల్ లో బాధ్యతలు చేపట్టి, వరంగల్లో పలు పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహించారు. అనంతరం 2007 సంవత్సరంలో ఇన్స్పెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఇన్‌స్పెక్టర్‌గా వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పని చేశారు.

2017 సంవత్సరంలో డీఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించి రామగుండం కమిషనరేట్ లో క్రైమ్ ఏసీపీగా హన్మకొండ, సైబరాబాద్ లలో ఏసీపీ క్యాడర్ లో ముఖ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కరీంనగర్ పోలీస్ ట్రేనింగ్ కళాశాల లో పని చేశారు. అదే సమయంలో 2021 సంవత్సరంలో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి జిల్లాలో విధులు నిరహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను సేవ పథకం, ఉత్తమ సేవ పథకాలతో అందించారు. అదేవిధంగా ఈ రోజు మహోన్నత సేవ పథకం కూడా అందుకున్నారు. 34 సంవత్సరాల సుదీర్ఘ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్ కి గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఎంపిక చేసింది.

# కార్మికులు కర్షకులు ఆర్థికంగా స్వావలంబన పొందినపుడే నిజమైన స్వతంత్రం

### యునైటెడ్ బహుజన పోరాట సమితి జాతీయ కన్వీనర్ కరణం తిరుపతి నాయుడు

గుంటూరు ఆగస్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): కార్మికులు కర్షకుల ం,రైతులు ఆర్థికంగా స్వావలంబన పొందినపుడే మనకు నిజమైన స్వతంత్రం లభించినట్లని యునైటెడ్ బహుజన పోరాట సమితి జాతీయ కన్వీనర్ కరణం తిరుపతి నాయుడు అన్నారు. శుక్రవారం 79 వ స్వాతంత్ర్యం దినోస్సవం పురస్కరించుకొని సమితి కార్యాలయం ఎదుట జాతీయ జండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 79 సంవస్సరాలు దాతుతున్నప్పటికి కార్మికులు కర్షకులు, రైతుల బతుకులు మారలేదని, రెక్కఆడితేగాని దోక్కనిండని పరిస్తితని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. కర్షకులు కార్మికులు ఐక్యమత్యంగా కలిసి ఉండి ఆర్థికంగా కుటుంబ పోషణతో అభివృద్ధి చెందాలని ఆయన పిలుపునిచ్చారు.

# భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీశైలం ఆలయంలో సౌకర్యాలు : ఈవో శ్రీనివాస రావు



శ్రీశైలం, ఆగష్టు 15: : శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా వలు సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆలయ ఈవో శ్రీనివాస్ రావు వెల్లడించారు. 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆలయ కార్యాలయ భవనం ఎదుట మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను నేడు అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

నందికొట్కూర్‌కు చెందిన సాయిలిక్షిత శ్రీ ప్రదర్శించిన దేశభక్తి గేయాల సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.

శ్రీశైలం ఒకటవ టౌన్‌లో సీఐ ప్రసాదరావు జెండాను ఎగురవేసి సిబ్బంఇకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, శివసేవకులు, ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ సీఐ వీరప్రసాద్‌కు ఉత్తమ సేవ పురస్కారం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ విశిష్ట సేవలకు గాను ఉత్తమ సేవ పురస్కారంఅందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణ మైదానంలో సీఐ వీర ప్రసాద్ ప్రభుత్వ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తమ సేవ పునస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వీర ప్రసాద్ ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అభినందించారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

-స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రతిబింబించేలా ఘన కార్యక్రమం

-ఆకట్టుకున్న సాంస్కృతిక, దేశభక్తి గీతాలు, నాటికలు, బైక్ ర్యాలీ




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్కూల్ ప్రాంగణంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రతిబింబించేలా ఘన కార్యక్రమం జరిగింది. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యాజమాన్యం నేతృత్వంలో సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు, నృత్యాలు, స్వాతంత్ర్య పోరాటం నేపథ్య నాటికలు ప్రదర్శించడంతో వేదిక దేశభక్తి రంగులతో అలరారింది. కార్యక్రమం అనంతరం ఆపరేషన్ సింధూర్ కి మద్దతుగా పట్టణంలోని ప్రధాన వీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దేశభక్తి నినాదాలతో ఊరేగుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో నింపారు. యాజమాన్యం మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి విలువలు పెంపొందించడం, స్వాతంత్ర్య పోరాటం చరిత్రను గుర్తుచేయడమే మా లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీలంపాటి శ్రీధర్, విద్య, ఏజియం ముద్రకోల రాజు,. అకడమిక్ పిపిటికో ఆర్డినేటర్ యం.మమత, ప్రిన్సిపాల్, డి.సుదేశ్ కుమారి,లీలావతి,డీన్ టి.అంజయ్య, సి ఇన్చార్జి కె.అరుణ్,అన్ని శాఖల ఇన్చార్జి లు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని కేసీఆర్ నాయకత్వం నిజం చేసింది: పద్మారావు గౌడ్




సికింద్రాబాద్ ఆగష్టు 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);79 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సికింద్రాబాద్ సీతాఫల్ మండి బిఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసన సభ్యులు టి.పద్మారావు గౌడ్ జాతీయ జండాను ఎగుర వేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పోరాటం జరిపి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అభివృద్ధి, సంక్షేమం, తలసరి ఆదాయం, వ్యవసాయ విస్తరణలో అద్భుత విజయాలను సాధించి.. జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని కేసీఆర్ నాయకత్వం నిజం చేసింది. ఎక్కడో 14 స్థానంలో ఉన్న తెలంగాణ 10 ఏళ్లలోనే పంజాబ్, హర్యానాను వెనక్కి నెట్టి ధాన్యం ఉత్పత్తిలో అగ్రభాగాన చేరడానికి రైతును రాజునే చేయాలన్న కేసీఆర్ సంకల్పమే కారణం అని పేర్కొన్నారు.

ఎన్నో కులాలు, ఎన్నో మతాలు, ఎన్నో భాషలు, ఎన్నో రాష్ట్రాలు కలిగి ఉన్న వైవిధ్య భారతానికి స్వాతంత్రం సిద్ధించి 79 ఏళ్లు అవుతుందని ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ పా బీఆర్ఎస్ తరపున హృదయపూర్వకంగా స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

14 రాష్ట్రాలతో మొదలైన స్వతంత్ర భారతదేశ ప్రయాణం ఇవ్వాళ 28 రాష్ట్రాల వైవిధ్య భారతంగా విలసిల్లుతుందన్నారు..అతి చిన్న వయసు కలిగిన తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో మొత్తం భారతదేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

వవ కార్యక్రమం లో రామేశ్వర్ గౌడ్,సామల హేమ ,నిర్మల ముదిరాజ్, శోభ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రద్దైన రైళ్ల పునరుద్ధరణకు కృషి : ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



ఖమ్మం, ఆగష్టు 15:డోర్నకల్ జంక్షన్ నుండి భద్రాచలం రోడ్డు వరకు గతంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించేందుకు రైల్వే అధికారులతో చర్చిస్తానని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి ఎంపీ శుక్రవారం కారేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లలో పలు రైళ్లను నేటికీ పునరుద్ధరించలేదని పేర్కొంటూ సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి ఎంపీకి వినతి పత్రం అందజేశారు. కరోనా కంటే ముందు డోర్నకల్ జంక్షన్ నుండి భద్రాచలం రోడ్డు వరకు కారేపల్లి జంక్షన్ మీదుగా రోజు ఎనిమిది రైళ్లు నడిచేవని, కరోనా సమయంలో ఈ రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ కరోనా తర్వాత అందులో కొన్ని రైళ్లను మాత్రమే పునరుద్ధరించి మిగతా రైళ్లను నేటికీ పునరుద్ధరించలేదని తెలిపారు. అలాగే ఈ రైల్వే లైన్‌లో నడిచే ప్రతి రైలు కూడా అన్ని స్టేషన్లలో ఆగేవని, కానీ ప్రస్తుతం నడిచే రైళ్లు కారేపల్లిలో తప్పా మిగతా స్టేషన్లలో ఆగడం లేదని, తద్వారా ఈ ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎంపీకి వివరించారు. సమస్యలన్నింటినీ రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం కారేపల్లి రైల్వే స్టేషన్‌ను ఎంపీ పరిశీలించి స్టేషన్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# డ్రైవర్‌గా మారి.. ఆర్టీసీ బస్సు నడిపిన నందమూరి బాలకృష్ణ

అమరావతి, ఆగష్టు 15: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి వార్తల్లో నిలిచారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవంలో భాగంగా హిందూపురంలో ఆర్టీసీ బస్సును నడిపారు.

ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. హిందూపురంలో బాలకృష్ణ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందూపురం బస్టాండ్ నుంచి బాలయ్య క్యాంప్ ఆఫీసు వరకు ఆర్టీసీ బస్సును డ్రైవ్ చేశారు. బస్సులో మహిళా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకుని రెండు కిలోమీటర్ల మేర బస్సు నడిపించారు.

ఇదిలా ఉంటే, స్త్రీశక్తి పథకం ప్రారంభానికి ముందు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఉండవల్లి గుహల వద్ద నుంచి తాడేపల్లి, కనకదుర్గ వారధి మీదుగా విజయవాడ సిటీ టెర్మినల్ వరకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ కూడా ఆ ఆర్టీసీ బస్సులోనే వెళ్లారు. కాగా ఉచిత బస్సు పథకం ప్రారంభం నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హడావుడి చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మార్గం వెంబడి బాణసంచా కాల్చారు. డీజే, తీన్మార్ డ్యాన్సులతో హంగామా చేశారు.

# తెలంగాణకు మళ్లీ చీకటి రోజులు..

నిజామాబాద్, ఆగస్టు 15: కాంగ్రెస్ పాలన వచ్చి తెలంగాణకు మళ్లీ చీకటి రోజులు దాపురించాయని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలిపి పదేళ్లలో కేసీఆర్ తెచ్చిన స్వర్ణ యుగం కాంగ్రెస్ రాబందుల పాలవుతుందని ఎవరూ ఊహించ లేదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్వరాష్ట్రంగా మారి బానిసత్వ శక్తుల కబంధ హస్తాల నుంచి బయటపడిన సంతోషం పట్టుమని పదేళ్లలోనే మాయం వైందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల హక్కులను హరించి బతికే కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం పేరుతో అదే బానిసత్వం, అదే అణచివేత మళ్లీ తెలంగాణలో కరాళ నృత్యం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అవే మోసాలు కొనసాగిస్తూ ప్రజలను అదే గోస పెడుతోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. విదేశీ సంతతికి చెందిన కాంగ్రెస్ బ్రిటిష్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని అభినవ ఈస్టిండియా కంపెనీ అవతారమెత్తి దోచుకు తింటున్నదని ఆయనఆరోపించారు. బీజేపీ ఒక నార్తిండియా కంపెనీ అని ఆయన పేర్కొంటూ కాంగ్రెస్, బీజేపీ రెండూ దోపిడీ, దగాకోరు కంపెనీలేనని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతి, బీజేపీ దుర్నీతికి తెలంగాణ ప్రయోగశాలగా మారిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు తెలంగాణను నిలువునా దోపిడీ చేస్తూ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతున్నారని ఆయన అన్నారు. బీజేపీ తెలంగాణ పట్ల దుర్నీతి ప్రదర్శిస్తూ తెలంగాణపై పగ పెంచుకొని దగా చేస్తోందన్నారు. తెలంగాణకు దక్కాల్సిన సెమీకండక్టర్ పరిశ్రమ ఏపీకి తరలించి తెలంగాణ నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన బీజేపీకి తెలంగాణలో ఉండే అర్హత ఉందా?అని జీవన్ రెడ్డి నిలదీశారు.

తెలంగాణపై కొనసాగుతున్న మోదీ సర్కారు వివక్ష పై నోరువిప్పని రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల వైఖరి సిగ్గుచేటని ఆయన విమర్శించారు. తెలంగాణ అంటేనే కడుపులో కత్తులు పెట్టుకున్నట్టు, కండ్లల్లో కక్ష నింపుకొన్నట్టు వ్యవహరించే కాంగ్రెస్ –బీజేపీ ద్వయం నిజరూపాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. నాటి ఆంగ్లేయుల వంకర బుద్దే నేటి కాంగీయులదని, అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను సమాధి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు నులిమే తీరు చూస్తుంటే



అసలు గాంధీజీ మార్గం కాకుండా గాడ్ సే పద్ధతి అనుసరిస్తు న్నట్టు కనిపిస్తోందని ఆయన మండిపడ్డారు. తెలంగాణకు కాంగ్రెస్ కిరాయి, బీజేపీ పరాయి పార్టీ అని ఆయన అభివర్ణించా రు. తెలంగాణ ఆత్మ గౌరవం దెబ్బతీసేలా ఢిల్లీ పెత్తనం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ నుంచి తరిమికొట్టేందుకు ప్రజలంతా మరో సంగ్రామానికి సంసిద్ధులు కావాల్సిన సమయం ఆసన్నమైందని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# అర్బన్ మండల బీజేపీ అధ్వర్యంలో స్వాతంత్ర వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నంది కమాన్ చౌరస్తా వద్ద 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజలందరూ కూడా దేశాన్ని ప్రేమించాలని ఎందరో త్యాగమూర్తుల ఫలితమే ఈనాడు ఈ స్వతంత్ర భారతదేశము అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఏ రెడ్డి రాజిరెడ్డి, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, ఎరుగోక్కుల రమేష్ ,బి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి జింక శ్రీనివాస్ ,తిప్పర వేణి రాజు, ఆంజన్నాయదవ్ సంతోష్ యాదవ్, సంజీవరెడ్డి, చొక్కాల మధు ,జక్కుల మధు, ఎర్రం రమేష్ ఎర్రం లక్ష్మీనర్సు, చింతకుంట నర్సయ్య, చల్ల నరసయ్య, కర్రే పవన్ పోచంపల్లి భాను, చొక్కాల ప్రశాంత్ ,పేరంగాని



మల్లేశం, తాండ్ర ఆనందం తిరుపతి బాలకృష్ణ, బియ్యాల దామోదర్ రెడ్డి, లక్ష్మారెడ్డి ముడికే రాములు, కంసాని రాము, గాండ్ల మధురావు, లింగంపల్లి సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో రైలు కిందపడి ఆత్మహత్య

కరీంనగర్, ఆగష్టు 15:పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రానికి చెందిన ఐలు రాజు గౌడ్(41) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. రైల్వే పోలీస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజు గౌడ్ తన కులవృత్తి అయిన కలాలితోపాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. తన వ్యవసాయ భూముల సమీపంలో రైల్వే ట్రాక్ ఉండగా అక్కడ రైలు కిందపడి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# పెద్ద బీరవల్లిలో నీట మునిగిన పంట పొలాలు

ఖమ్మం, ఆగష్టు 15: తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, చెరువులు, మున్నేరులు వరద నీటితో పొంగిపొర్లుతున్నాయి. బోనకల్లు మండలంలోని పెద్ద బీరవల్లి గ్రామ సమీపంలో గల పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి. ఈ వాగుకు కొనిజర్ల, చింతకాని మండలాల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద చేరుకోవడంతో వాగు సమీపంలో గల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. చెరువుల కింద నాట్లు వేసిన వరి పొలాలు పూర్తిగా వరద నీటితో మునిగిపోయాయి. అదేవిధంగా పత్తి, ఆయిల్‌పామ్ తోటల్లో వరద నీరు ప్రవహించి పంట భూముల్లో నీళ్లు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి.

# కోదాడలో ఘనంగా శ్రీకాంతాచారి జయంతి

నల్గొండ, ఆగషు 15: 1,200 మంది బిడ్డల అమరత్వంతో పాటు మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతా చారి ఆత్మత్యాగంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఉమ్మడి నల్లగొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయపూడి వెంకటనారాయణ అన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాంతా చారి జయంతిని కోదాడలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు 250 గజాల ఇంటి స్థలం కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేంద్ర చారి, వీరాచారి, శ్రీధర్ చారి, హనుమాన్ చారి, ఉపేంద్ర చారి, నాగ కృష్ణమాచారి, రామబ్రహ్మం, సాయి నరేశ్ చారి పాల్గొన్నారు.

# శ్రీశైలం అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ భక్తుని విరాళం

శ్రీశైలం,ఆగష్టు 15: శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారల దేవస్థానంలో జరుగుతున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శంకర వెంకట కామేశ్వరరావు విరాళం అందజేశారు. శనివారం నాడు దేవస్థాన పర్యవేక్షకులు ఎం.రవికుమార్‌కు ఆలయ ప్రాంగణంలో 1,06,116 రూపాయలను విరాళమిచ్చారు. ఈ సందర్భంగా దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

# ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్న తాండూరు పోలీసు అధికారులు

ఆదిలాబాద్, ఆగష్టు 15: తాండూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ దేవయ్య, సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సీఐ దేవయ్య ఉత్తమ ఉద్యోగి అవార్డును జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీ భాస్కర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ చేతుల మీదుగా ఎస్సై డి కిరణ్ కుమార్ ఉత్తమ సేవ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నర్సాపూర్ వద్ద నిండుగా పారుతున్న వాగులో నిండు గర్భిణి వాగులో చిక్కుకుంది. పోలీసులు, గజ ఇతగాళ్లు, నాయకుల సాయంతో పాటు ఎస్సై స్వయంగా వాగులోకి దిగి తాళ్లు ఏర్పాటు చేసి నిండు గర్భిణీని సురక్షితంగా రక్షించి ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు.

అతడి ధైర్యసాహసాలను గుర్తించిన అధికారులు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు.

# అట్లాంటాలో శంకర నేత్రాలయ సేవా దీక్ష..

## 1.25 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ



హైదరాబాద్, ఆగష్టు 15: గ్రామీణ భారతదేశంలో నివారించదగిన అంధత్వ నిర్మూలన లక్ష్యంతో శంకర నేత్రాలయ జూం ఆధ్వర్యంలో అమెరికాలోనిఅట్లాంటాలో క్లాసికల్ డ్యాన్స్, మ్యూజిక్ కార్యక్రమం ఘనంగా జరిగింది. జార్జియాలోని కమ్మింగ్ వెస్ట్ ఫోర్సిత్ హైస్కూల్‌లో జరిగిన ఈ వేడుకలో ఓఇాజ (మొబైల్ ఐ సర్జికల్ యూనిట్) "అడాప్ట్-ఎ-విలేజ్" నేత్ర శస్త్ర చికిత్స శిబిరాలకు మద్దతుగా వి1.25 మిలియన్ (రూ. 10.4 కోట్లు) నిధులు సమీకరించారు.

సాంస్కృతిక విభాగాన్ని కల్చరల్ చైర్ నీలిమ గడ్డమణుగు సమన్వయం చేయగా, గాయకులు శాంతి మెడిచెర్ల, సందీప్ కౌతా, ఉషా మోచెర్ల, జనార్దన్ పన్నెల, స్రవంతి కెటి, శిల్పా ఉప్పులూరి, శ్రీనివాస్ దుర్గం, రామ్ దుర్వాసుల అలరించారు. నృత్య ప్రదర్శనలు గురువులు శ్రీదేవి రంజిత్ (మోహినీయాట్టం), సోబియా సుదీప్ కిషన్ (భరతనాట్యం), మిటల్ పటేల్ (కథక్), నీలిమ గడ్డమణుగు (కూచిపూడి) విద్యార్థులు అందించారు.

కార్యక్రమానికి భారత కాన్సుల్ జనరల్ రమేశ్ బాబు లక్ష్మణన్, శంకర నేత్రాలయ జూం అధ్యక్షుడు బాలారెడ్డి ఇందుర్తి, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ తడికమల్ల, కోశాధికారి మూర్తి రేకపల్లి, ట్రస్టీలు శ్రీనిరెడ్డి వంగిమల్ల, మెహర్ లంక, రాజ్ ఐల, రమేశ్ చాపరాల, డాక్టర్ కిషోర్ రెడ్డి రసమల్లు, గిరి కోటగిరి తదితరులు హాజరయ్యారు. బ్రాండ్ అంబాసిడర్ ప్రసాద్ రెడ్డి కాటంరెడ్డి, సలహాదారులు ౫ఎ ఆచార్య, నిర్మలా ఆచార్య, లీలా కృష్ణమూర్తి, నాట్ కృష్ణమూర్తి, డాక్టర్ కిశోర్ చివుకులను ప్రత్యేకంగా సన్మానించారు.

పూర్వాధ్యక్షురాలు లీలా కృష్ణమూర్తికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. ప్రధాన దాతలుగా డాక్టర్ గోవింద విశ్వేశ్వర, కాష్ బూటాని, ప్రకాశ్ బేడపూడి, ఎఖీ రెడ్డి, డాక్టర్ వీణా భట్, అరవింద్ కృష్ణస్వామి, జలంధర్ రెడ్డి, రఘు సుంకి, మురళీ రెడ్డి, కరుణాకర్ ఆసిరెడ్డి, భువనేశ్ భూ జల రెడ్డి, తిరుమల్ రెడ్డి కంభం, డాక్టర్ బీకే మోహన్, శ్రీధర్ రెడ్డి తిక్కవరపు, కిరణ్ రెడ్డి పాశం, వెంకట్ కణ్ణన్, డాక్టర్ లక్ష్మణ్ కల్వకుంట్ల, బుచ్చిరెడ్డి గోలి, శ్రీని ఎస్వీ, డా. మాధవ్ దుర్భ, వెంకట్ చుండి, ప్రసన్న కుమార్, ప్రభాకర్ రెడ్డి ఎరగం, జయంత్ నీలం, డాక్టర్ ప్రియ కొర్రపాటి, శ్రీనివాస్ మునుకుట్ల, జేసీ శేఖర్ రెడ్డి, రవి కందిమళ్ల, అనిల్ జాగర్లమూడి, డాక్టర్ ప్రసాద్ గరిమెళ్ల, వంశీ మాదాడి, భరత్ మాదాడి, స్వర్ణిమ్ కాంత్, కోదండ దేవరపల్లి, తిరు చిల్లపల్లి, జగదీశ్ చీమర్ల, శ్రీనివాస్ సూరపనేని, నారాయణ రేకపల్లి, డాక్టర్ మంజుల మంగిపూడి, ప్రతాప్ జక్కా, డా. నీతా సుక్తాంకర్, విష్ ఈమని, వర అకెళ్ళ, రజనీ పువ్వాడలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో శంకర నేత్రాలయ ఓఇాజ యూనిట్లు మారుమూల ప్రాంతాల్లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి, వేలాది మందికి చూపుని పునరుద్ధరించనున్నాయి. "మంచి హృదయాలు ఐక్యమైతే అద్భుతాలు జరుగుతాయి" అని అఉఎ రమేశ్ బాబు, "ప్రతి స్పాన్సర్ ఒక గ్రామానికి ఆశాకిరణం" అని అధ్యక్షుడు బాలారెడ్డి పేర్కొన్నారు.

# టెన్త్ ర్యాంకర్‌కు నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసిన కలెక్టర్

ఆదిలాబాద్, ఆగష్టు 15:నిర్మల్ జిల్లా కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన ఏషాల లక్ష్మి-విఠల్ దంపతుల కూతురు ఏషాల సాహిత్య కు నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నిర్మల్ పట్టణంలోని సోఫీ నగర్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో చదివిన సాహిత్య పదో తరగతిలో 587 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. జిల్లా కేంద్రం నిర్మల్‌లో జరిగిన స్వాతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా ఎస్పీ జానకి షర్మిల రూ. 10వేల నగదు, ప్రశంసా పత్రం అందించి విద్యార్థినిని అభినందించారు. అత్యధిక మార్కులు సాధించి జిల్లాకే వన్నెతెచ్చిన సాహిత్యను కలెక్టర్ తో పాటు రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు అభినందించారు. ఉన్నత చదువుల్లో ఇదే పంథాను కొనసాగిస్తూ రాణించాలని ఆకాంక్షించారు.

